# పాత, క్రొత్త నిబంధనల మధ్య కాలము

## I. పరిచయం - చరిత్రలోని విరామం - సమాచార మూలములు.

పాత, క్రొత్త నిబంధనల మధ్య నాలుగు వందల సవంత్సరాల పొడవైన చరిత్ర విరామముంది. ఆ శతాబ్దాల కాలంలో గ్రీసు దేశము సాహిత్యము, కళలు అనేవాటిలో చాలా గొప్పవాటిని రూపొందించింది; గ్రీకు ఆయుధాల శక్తిని, గ్రీకు కళల శక్తియందలి లాభాలను మహా అలెగ్జాండరు పశ్చిమ ఆసియా ప్రాంతానికి కొనిపోయాడు; రోమైతే, టైబరు పై సరిహద్దు పట్టణపు స్థితినుండి, "మధ్యధరాలోని ఏక చక్రాధిపత్యంగా" రోమీయ రహదారులు విశాలంగా పెంచడంచేతను, రోమా చట్టాలు, రోమా నాగరికత, దేవుని నీతి రాజ్యము ఎక్కువ విశాలంగా పెరిగేలా సిద్ధతలను గావించింది. ఈ శతాబ్దాల కాలంలో, హెబ్రీ ప్రవక్తలయొక్క స్వరం, దైవ ప్రేరేపితులైన చరిత్రకారుల కాలంవలెనే నిశబ్దంగా నిలిచాయి. యూదుల విషయమైన మన ఎరుకకు మనం మూడు మూలాల మీద ఆధారపడతాం, అవేవంటే:

**1. పాత నిబంధన అపొక్రిఫా.** – అవి ఈ కాలంలోని యూదుల రచనలు, పాత నిబంధనకు యివి ఒక విధంగా దైవ ప్రేరేపితముకాని అనుబంధాలుగా మిగిలాయి. ఆ కాలపు చరిత్రపై ఎక్కువ వెలుగును అవి విరజిమ్ముతాయి, కాని విధిగా నియమింపబడిన గ్రంథాలకంటె చాల తక్కువవిగా అవి ఉంటాయి. ఐగుప్తు జ్ఞాపక చిహ్నాలు, బబులోను శాసనములు లిఖింపబడిన ఇటుకలు, నీనెవె అక్షరాలు చెక్కబడిన పలకలు, యింకా అనేక అనేకములైన కనుగొనటాలు లేఖనాల రికార్డు కచ్చితమైనట్టు స్థాపించుతూ ఉండగా, అపొక్రిఫ్ రచనలు జరిగిన కాలమును కొంత తేడాగా చెప్పినవాటితో నిండినట్లు, మరియు యితర చరిత్రకును, భౌగోళికమైన దోషాలతో నిండియున్నట్టును రుజువు చేయబడ్డాయి. చరిత్రపరంగా మెకబ్బీల రెండు రచనలు మాత్రం బహు విలువైన సేకరణలే.

**2. జోసిఫస్ రచనలు. – జోసిఫస్.** క్రీ.శ. 37లో జన్మించిన యూదుల చరిత్రకారుడు. యెరూషలేము పట్టబడి, టైటస్‌చే నాశనం చేయబడిన తరువాత కూడా అతడు బ్రతికే యున్నాడు. సృష్టి ఆరంభంనుండి, "యూదుల ప్రాచీన కాలములు" అనే సంపూర్ణ చరిత్ర మరియు "యూదుల యుద్ధాలు" అని తన స్వజనుల గాథను క్రీ.పూ. 170నుండి యిచ్చాడు.

**3. గ్రీకు, రోమా రచనలు.**

## II. రాజకీయ కాలములు.

రాజకీయ చరిత్ర ఆరు కాలాలతో కూడి ఉంటుంది. అవేవంటే: (1) పారసీకుల; (2) మాసిదోనియుల; (3) ఐగుప్తీయుల; (4) సిరియనుల; (5) మెక్కబీయుల లేక స్వతంత్రమయిన; (6) రోమీయుల – కాలములు.

**1. పారసీకుల కాలము** (క్రీ.పూ. 538–332). – మహా కోరెషు ఆధ్వర్యంలో బబులోను పట్టుకొనడంతో ఈ కాలము ఆరంభమౌతుంది. దానికి ఫలితంగా యూదులు పారసీకుల అధికారం క్రిందికి మార్చబడ్డారు. అందువలన, ఈ కాలంలో ఎక్కువ భాగం పాత నిబంధన చరిత్రలోని చెరానంతర కాలంచే విస్తరింపబడింది. పారసీకుల క్రింద యూదులు సహజంగా వారి ప్రధాన యాజకునిచే గవర్నరుకులోనై పరిపాలింపబడ్డారు. ప్రధానంగా, పారసీకుల పాలన ప్రశాంతంగా సాగింది. యూదులకు సమరయులతో తంటాలు కొనసాగాయి. వీరు అష్షూరీయులతో మిళితమైన పది గోత్రాలతో మిగిలి ఉన్నారని గుర్తుంచుకోవాలి. తమ మతాన్ని విడిచిన యూదులచే వీరు తరచుగా బలపరచ బడ్డారు. వారిలో మనష్షే అనే ఒక యాజకుడు క్రీస్తు పూర్వం రమారమి 400 సంవత్సరాల ప్రాంతంలో గెరిజీము కొండమీద దేవాలయాన్ని నిర్మించాడు (యోహాను 4:20తో పోల్చి చూడు). సమరయులకు కాండ పంచకం ఉంది, వారు దేవునియందు విశ్వాసముంచారు, బలులు అర్పించేవారు, మెస్సీయా కొరకు ఎదురు చూచారు. సమరయుల మతం యూదా మత భ్రష్టత్వమునుండి కలిగినదిగా వర్ణించబడింది.

**2. మాసిదోనియుల కాలము** (క్రీ.పూ. 332–323). – 334 వసంత కాలంలో, సాటిలేని యుద్ధ విజయాలతో మహా అలెగ్జాండరు ఆసియాను దాటాడు. దరియావేషును గ్రానికస్, ఇస్ససులలో ఓడించి, ఏడు మాసాల మొండి ప్రతిఘటన తరువాత తూరును పట్టుకొని, తన ఐగుప్తు మార్గంలో పాలస్తీనా గుండ ఎదురైన సమస్తాన్ని తుడిచివేశాడు. ఊరేగింపుకు ముందు నడిచిన ప్రధాన యాజకుడైన జెదూవ, యెరూషలేము వెలుపల అలెగ్జాండరును[1] ఎలా కలిసికున్నాడో, ఆ దృశ్యానికి అలెగ్జాండరు అసాధారణంగా గౌరవించడానికి ఎలా కదిలింపబడ్డాడో, సహజంగా దోచుకోకుండా పట్టణాన్ని ఎలా విడిచిపెట్టాడో; అతడు దేవాలయంలో ప్రవేశించి యూదుల దేవునికి అతడు ఎలా ఆరాధన సమర్పించాడో; తాను పారసీకులను జయించాలని తనకు చెప్పిన ఆ ప్రధాన యాజకుని మాసిదోనియలో ఉన్నప్పుడు కలలో చూచిన దానిని బట్టి అతడు అలా అసాధారణంగా ప్రవర్తించినట్టు తన ఆఫీసర్లకు ఎలా వివరించాడో– జోసిఫస్ శ్రద్ధ కలిగించే ఒక కథను చెప్పాడు[2] ఏమైనాసరే, అలెగ్జాండరును, అతని వెనుకవచ్చిన వారును యూదుల పట్ల సదభిప్రాయం కలిగియున్నారు. నైలు ప్రాంతంలో స్థిరపడిన యూదులకు ఎలాటి ప్రత్యేకానుకూలతలను కల్పించారంటే, యూదుల జనాభాకు అలెగ్జాండ్రియా కేంద్రంగాను, యూదుల విద్యకు అది ప్రధాన స్థానంగా మారిపోయింది.

**3. ఐగుప్తీయుల కాలము** (క్రీ.పూ. 323–204). – బబులోను వద్ద క్రీ.పూ. 323లో అలెగ్జాండరు మృతిపొందాడు. సామ్రాజ్యాన్ని పంచుకునే విషయంలో సేనాధిపతుల మధ్య యిరవై సంవత్సరాలు పోరు జరిగిన పిమ్మట, కొంత క్రమము

అనేది ఏర్పడింది. ఆసియాకు సంబంధించిన రాష్ట్రాలలో ఎక్కువ భాగం సెల్యూకసుకు దక్కాయి. సూజా, బబులోను, దమస్కువంటి ప్రాచీన తూర్పు రాజధాని నగరాలను దాటి, మాసిదోనియకు సమీపంలో ఆరెన్‌టస్ నదిమీద అంతియొకయ అనే వైభవంతో కూడిన పట్టణాన్ని అతడు స్థాపించాడు. అప్పటినుండి రెండున్నర శతాబ్దాలు సెల్యూకస్ వారసులు ధనవంతమైన సిరియా రాజ్యాన్ని ఏలారు, ఆసియా యొక్క ధనం, నాగరికత శతాబ్దాల తరబడి అక్కడ కేంద్రీకృతమయ్యింది.

టాలమి ఐగుప్తును గెలుచుకున్నాడు, అలెగ్జాండ్రియా అనే దాని క్రొత్త రాజధాని నగరం శీఘ్రముగా వర్తకానికిని, సాహిత్యానికిని తూర్పు భాగంలో ప్రధాన నగరంగా మారిపోయింది. ఈ రెండు రాజ్యాలు, రాజధాని నగరాలు ఒకదానితో నొకటి పోటీ పడుతున్నాయి. టాలమి పాలస్తీనాను ముందుగా సెల్యూకస్ వద్దనుండి లాగివేసికొన్నాడు. టాలమి క్రింద ఒక శతాబ్దం, ప్రధానంగా, యూదులకు అభ్యుదయంగానే ఉంది. అలెగ్జాండ్రియాలోని లైబ్రరీ కొరకు టాలమి ఫిలడెల్ఫస్ ఆజ్ఞ మేరకు హెబ్రీ లేఖనాలను గ్రీకులోనికి తర్జుమా చేయించడం చాలా గుర్తింపదగిన కార్యమైయుంటుంది. ఈ తర్జుమాను సెప్టూజెంట్ అని ఉపయోగింపబడిన తర్జుమాదారులను బట్టి పిలిచారు.

**4. సిరియనుల కాలము** (క్రీ.పూ. 204-167). - పోటిపడుతున్న అధికారుల మధ్య పాలస్తీనా ప్రధాన స్థానంగా మారింది. టాలమిల చేతుల్లోనుండి సెల్యూకస్‌వారు చివరికి ఆ భూభాగాన్ని తిరిగి పొందారు. సిరియనుల ఏలుబడి కటిక చీకటివంటిదైనా, ఆ నాలుగు వందల సంవత్సరాల కాలంలో చాలా దివ్యమైనదిగా అది ఉంది. సెల్యూకస్ వంశీయులు చాలా క్రూరమైన నియంతలు. వారందరిలో యాంటియోకస్ ఎపిఫినాస్ అనేవాడు (క్రీ.పూ. 175-164) చాలా భయంకరుడు. ఐగుప్తులో ఓడిపోయి తాను తిరిగివచ్చే ఒక సమయంలో, అతడు యెరూషలేముపై తన పగ తీర్చుకున్నాడు. దాని జనాభాలో నలభై వేలమందిని ఊచకోత కోశాడు, (హతమార్చాడు), దేవాలయాన్ని కొల్లగొట్టాడు, యూదుల మతాన్ని అవమానపరచడానికి దేవాలయపు బలిపీఠంమీద పందిని అర్పించాడు, అపవిత్రమైన ఆ జంతువులోని కొంత భాగాన్ని వండే దేవాలయపు అంతర్భాగంలో సారాయిని చిలకరించాడు. హెబ్రీ మతాన్ని వారి ఆత్మ ధైర్యాన్ని సంపూర్ణంగా లయపరచి, గ్రీకుల దేశంగా దాన్ని మార్చాలని శత విధాలా అతడు కృషిచేశాడు. దేవాలయాన్ని మూసేవాడు యూదుల మతాన్ని మరణ బాధలు పెట్టి నిషేధించాడు. జన సమూహాలు తమ విశ్వాసాన్నిగాక, తమ అశువులనే బహు ధైర్యంగా అర్పించారు. ఆ కాలంలో వీర ప్రతిఘటన చేసిన నాయకులు మెక్కబీలని పిలుపబడే దేశ భక్తులుగానున్న యాజక కుటుంబికులు.

**5. మెక్కబీయుల కాలము** (క్రీ.పూ. 167-63). - మత్తతియ అనే పేరుగల వృద్ధుడైన యాజకునిచే స్వాతంత్ర్య సమరము ఆరంభింపబడి, ముప్పై (30) సంవత్సరాలు అతని కుమారులచే కొనసాగింపబడింది. యూదులకు వాలస్ వంటివాడైన యూదా, ఒక్క సంవత్సరంలోనే అయిదు యుద్ధాలు గెలిచాడు, మరియు "మెక్కబీ" (సమ్మెట, సుత్తి) అనే బిరుదు తనను అనుసరించిన కుటుంబానికి యివ్వబడింది. యూదా ఎంతవరకు విజయం సాధించాడంటే దేవాలయాన్ని అతడు తెరిచి, పవిత్రం చేసి, దాన్ని తిరిగి

ప్రతిష్ఠించాడు, దాని గౌరవార్థం ఆలయ ప్రతిష్ఠ పండుగ కొనసాగించబడుతూ ఉండేది (యోహాను 10:22). చివరిగా యూదా యుద్ధంలో పడిపోయాడు; అయితే సీమోను అనే అతని సహోదరుడు నష్టపోయిన స్వాతంత్ర్యాన్ని తిరిగి సంపాదించాడు, మరియు సిరియనులచేత గుర్తింపు పొందాడు. సీమోను కుమారుడైన జాన్ హిర్కానస్ రాజు అనే బిరుదుతో వారసుడయ్యాడు. ఆలాగును ఆస్మోనీయుల[3] రాజ్యం స్థాపించబడింది, మెక్కబ్బీయులకు పితరుడైన ఆస్మోనియస్[4]నుండి ఆ పేరు వచ్చింది (ఆస్మోనియ లేక హాస్మోనియ).

**6. రోమీయుల కాలము** (క్రీ.పూ. 63–క్రీ.శ. 70, పాంపేచే యెరూషలేము పట్టబడినది మొదలుకొని టైటస్‌చే నాశనం చేయబడేవరకు). – మెక్కబీల చివరి సంవత్సరాలు నీచమైన అంతరంగ పోరాటాలతో ఉన్నాయి. హాస్మోనీయుల కుటుంబంలోనే పలువురు సింహాసనం కొరకు దెబ్బలాడుకొంటూ ఉన్నారు. కుట్రలు, వ్యతిరేకమైన కుట్రలు, ఒకరినొకరు హత్య చేసికొనడం, రేగుతున్న రోముకు విన్నపం చేసికొనడం వంటి పనులతో చరిత్ర కరాబు అయ్యింది. క్రీ.పూ. 63లో మహా పాంపే, మిత్రిడేటిక్ యుద్ధాన్ని ముగించుకొని, విజయవంతమైన తన సిపాయిలను సిరియాలోనికి నడిపించాడు. సెల్యూకసుల రాజ్యాన్ని అంతమొందించి, యెరూషలేమును పట్టుకొనడంచేత, యూదుల స్వాతంత్ర్య రాజకీయ జీవితం యొక్క కడపటి అగ్ని కణాలను ఆర్పివేశాడు. సిరియాకు సంబంధించిన రోమా గవర్నరుల క్రింద, స్థానిక అధికారులుగా ఆస్మోనియులు కొనసాగింపబడ్డారు. టైబర్‌నుండి జారీచేయబడిన నియంత్రత్వపు అధికారం క్రింద యిలా జరిగింది.

**హేరోదుయొక్క కుటుంబము.** – అయితే యిప్పుడు వ్యక్తిగతమైన శక్తి రంగంలోకి దిగింది కన్పిస్తుంది. యూదుల చరిత్రలో హేరోదుయొక్క కుటుంబం నాయకత్వపు పాత్రను వహించింది; యేసు క్రీస్తు జననము, ఆయన పని, మరియు సంఘ స్థాపనము అనేవాటిని దర్శించిన అతి ప్రాముఖ్యమైన శతాబ్దం. మహా హేరోదు (క్రీ.పూ. 37–4) ఎదోమీయుడు. క్రీ.పూ. 47లో అతని తండ్రియైన అంతిప (Antipater) యూదయకు గవర్నరుగా కావింపబడ్డాడు. అదే సమయములో హేరోదు గలిలయకు అధిపతిగా నియమింపబడ్డాడు. క్రీ.పూ. 40లో రోమా సెనెట్‌చేత యూదయకు అతడు రాజుగా నియమింపబడ్డాడు, కాని అతడు తన రాజ్యాన్ని సంపాదించుకోవలసివచ్చింది. అతడు దానిని క్రీ.పూ. 37లో సాధించాడు. హిర్కానస్ అనే యూదుల యాజక రాజుకు మనమరాలైన మారియమ్నేను వివాహం చేసికొని, ఆస్మోనియులతో తనకు పాలున్నట్టు సింహాసనానికి తాను హక్కుదారుడనని చెప్పుకున్నాడు. పరిపాలన చేయడంలో అరుదుగా సమానులుండే దక్షతను అతడు కనుపరచాడు; కాని అతని దుర్మార్గతలు దానిని మించిపోయాయి. తాను ఉపయోగించే విధానాలకు ఒక నియమమంటూలేని, కామలోలతగలవాడు, పిచ్చి అనుమానస్థుడు; అతని అత్త, బావమరిది, యిద్దరు కుమారులు, తన సొంత అందమైన భార్యయైన మారియామ్నే – నశింపజేయు అతని అసూయముందు రాలిపోయారు. పరుగు పందాలను, గ్రీకుల యితర ఆచారాలను అతడు యెరూషలేములో ప్రవేశపెట్టి నందుకు యూదుల ద్వేషాన్ని చవి చూచాడు. దాన్ని వారి దృష్టిలోనుండి పోగొట్టుకొనడానికి

గాను, సొలొమోను దేవాలయంకంటె మిక్కిలి పెద్దగాను, జెరుబ్బాబెలు కట్టించిన దేవాలయంకంటెను మిక్కిలి ఐశ్వర్యవంతంగాను ఒక దేవాలయాన్ని అతడు కట్టించాడు. ప్రాచీన షోమ్రోను పట్టణాన్ని అతడు తిరిగి నిర్మించి, దానికి సబస్టే అని పేరుపెట్టాడు. మరియు కైసరయ అనే క్రొత్త పట్టణాన్ని నిర్మించి, పాలస్తీనాకు దానిని రాజకీయ కేంద్రంగా చేశాడు. తన "బంధువుల రక్తంలో అతని సింహాసనం జలకాలాడినా," దావీదు, సొలొమోనుల రాజ్య కాలంలో తప్ప అత్యున్నతమైన వెలుపటి శోభను అతడు కలిగించాడు. అయినా, భౌతికమైన ఈ శోభ అంతయు యూదుల కండ్లు కప్పలేక పోయింది, వారు లోబరచబడిన జనమైయున్నా, తమ వంశావళులందును, మహిమతో కూడిన వారి గత జీవితాన్ని బట్టి యూదులు గర్విస్తుంటారు. వారు యింకా బంధకాలలోనే ఉన్నారు; అయితే వారి బంధకాలకు మెరుగుపెట్టబడుతుంది. హేరోదు పరాయి జాతివాడే. అయితే మరో పరాయి (రోమా) జాతి ప్రతినిధిగా అతడు ఏలుబడి చేశాడు. దావీదు గుడారం నిజంగానే పడిపోయింది. "ఇశ్రాయేలులోని ఇశ్రాయేలు," మళ్లీ ఉన్నతికి తీసుకొచ్చి పూర్వంవలె నిర్మింపగోరు వానికోసం పరితపించింది (ఆమోసు 9:12).

## III. జీవితంలోను ఆచారాలలోను మార్పులు.

**1. వృత్తి.** – ఆదిలో హెబ్రీయులు వ్యవసాయకులు, పశువుల కాపరులు. సొలొమోను కాలంలో, తరువాత వచ్చిన కొందరి రాజుల దినాల్లో, యితర దేశ వర్తకంతో వారు మునిగిపోయారు. చెరతో వారు చెదరగొట్టబడిన తరువాత వ్యాపార జనంగా వారు మారిపోయారు. ఆ లక్షణాన్ని వారు ఎన్నడూ పోగొట్టుకొనలేదు.

**2. భాష.** – చెరకాలంనుండి కూడా, భాషలో గొప్ప మార్పులు జరిగాయి. కల్దీయ, సిరియ, పర్యాయరూపాలు భాషలోనికి జొరబడ్డాయి. శతాబ్దాలు గడిచేకొద్ది, మోటు జాతుల దండయాత్రల అనంతరం ఇటలీకి ఏమి జరిగిందో అదే వీరికిని సంభవించింది. నవీన ఇటలీవాడు అత్యుత్తమమైన ఇటలీవాడుకాడు. అలాగే, అత్యుత్తమమైన హెబ్రీ మృతతుల్యమైన భాషగా మారిపోయింది. క్రైస్తవ యుగం ఆరంభమయ్యే సమయానికి పాలస్తీనాలో అరామి సాధారణంగా మాట్లాడే భాషగా రూపొందింది.

**3. మతము.** – మతంలోని మార్పులు ఈ క్రింది విధంగా సంక్షిప్తం చేయవచ్చు.

**ఎ. విగ్రహారాధన శాశ్వతంగా అంతరించింది.** – చెరకుముందు తమచుట్టు ఉన్న జనముల ఆరాధనను అనుకరించే తత్వం వారికున్నట్టు మనం గమనించాం. విగ్రహ సంబంధమైన దానికి ఏది ప్రీతికరంగా ఉంటుందో దానినంతటిని అసహ్యించుకునే స్థితికి వారు చేరుకున్నారు.

**బి. సమాజ మందిరాలు ఉద్భవించాయి.** – పాత నిబంధనలో సమాజ మందిరం అనే జాడే కన్పించదు. దేవాలయపు ఆరాధనలు లోపించినందున, సమాజ మందిరమనేది చెర కాలంలో ఆరంభమైయుండవచ్చు. సునగోగుగా రూపొందడానికి పదిమంది సభ్యులుంటే చాలు. యెరూషలేములో వందల కొలదిగా ఉంటాయి, అలాగే యింకా సామ్రాజ్యంలోని అనేక గొప్ప పట్టణాల్లో కూడా ఉంటాయి. అనుదిన బలి అర్పింపబడే

సమయాల్లో సమాజమందిరాల్లో ప్రార్థనలు జరుగుతాయి, సబ్బాతు దినాల్లో లేఖనాలు చదివి, వివరించడం, దీవెనతో ముగించడం జరుగుతుంది.

**సి. యూదా మతంలో తెగలు లేచాయి.** – వీరిలో (1) పరిసయ్యులు మోషే నోటి మాటతో చెప్పిన ధర్మశాస్త్రాన్ని నిలిపి, పారంపర్యంగా దాన్ని అప్పగించి, వ్రాయబడిన ధర్మశాస్త్రానికి సమానమైన అంతస్థును దానికిచ్చారు. పునరుత్థానానికీ, భవిష్యత్ జీవితానికీ సంబంధించిన సిద్ధాంతాన్ని పట్టుదలతో పట్టుకున్నారు. ప్రత్యేకింపబడిన వారుగా దృఢముగా నిలిచి, అన్యజనుల ఆచార ప్రవేశాన్ని వారు వ్యతిరేకించారు. దేశంయొక్క శ్రేష్ఠమైన భాగంగా వారు రూపొంది, జాతీయత గుర్తింపును శిథిలం చేసే శక్తుల మధ్య వారు నిలబెట్టారు. (2) సద్దూకయ్యులు. పై చెప్పబడిన అన్ని విషయాలలో వీరు పరిసయ్యులను వ్యతిరేకించారు. నోటి మాటతో చెప్పబడిన ధర్మశాస్త్రపు అధికారాన్ని వీరు కాదన్నారు, పునరుత్థానంగాని, భవిష్యత్ జీవితంగాని లేదన్నారు, వారిచుట్టునున్న జనములతో స్వేచ్ఛగా కలిసిపోడానికి వీరు యిష్టపడ్డారు, వారి ఆచారాలకు భావాలకు వీరు సమ్మతించారు. రోమీయులతో అనుకూలంగా ఉండాలని కోరుకునే రాజకీయ వేత్తలే వీరు. ప్రధాన యాజకుడు సహజంగా సద్దూకయ్యుల తెగకు చెందినవాడైయుంటాడు. (3) ఎసెన్నీయులు అనే చాల చిన్న తెగ ఉండేది. వారు సమాజంనుండి విరమించుకొన్న జీవితంతో, అంటే ఐహిక సుఖములపై విరక్తిగలిగి, తపస్సు చేసికొంటూ జీవించే జనులు. వీరిని యూదా సన్యాసులంటారు.

ప్రపంచపు మహోన్నత యుగంలో, భూమికి, దేశానికి గల స్థితి అలా ఉంది. అబ్రాహాము శరీర సంబంధమైన నిబంధన దీర్ఘకాలిక గతమై అత్యున్నత స్థితికి చేరుకుంది. ప్రవక్తలు నొక్కి వక్కాణిస్తూ వచ్చిన, ఆధ్యాత్మ సంబంధమైన ఉన్నతి పరిపూర్ణ స్థితికి చేరుకుంది. యూదా మతమనే ముళ్ళ మొలక క్రీస్తు మతమనే ఆధ్యాత్మిక ఫల వృక్షంగా లోక వ్యాప్తమైంది.

---

సూచనలు

[1]"జరిగిందని" డీన్ అన్నాడు. [2]Josephus, "Antiquities," Book XI., chap. viii. [3]Or Hasmonean. [4]Or Hasmoneus.

## క్రొత్త నిబంధన పుస్తకముల చర్చనీయాంశములు

మత్తయి: యూదులకు సువార్త
మార్కు: రోమీయులకు సువార్త
లూకా: అన్యజనులకు సువార్త
యోహాను: విశ్వాసపు సువార్త
కార్యగ్రంథం: గొప్ప ఆజ్ఞయొక్క నెరవేర్పు
రోమీయులకు: మనుష్యులను రక్షించే దైవ విధానం
1 కొరింథీ.: రిపోర్టులు చర్చించబడ్డాయి; ప్రశ్నలకు బదులివ్వబడ్డాయి
2 కొరింథీ.: అపొస్తలుని రక్షకము
గలతీయులకు: క్రీస్తునందలి స్వాతంత్ర్యము
ఎఫెసీయులకు: సంఘము, దేవుని అనాది సంకల్పము
ఫిలిప్పీయులకు: ఆనందించుటకైన పత్రిక
కొలొస్సయులకు: క్రీస్తు, సమస్తమునకు అధికారి
1 థెస్సలొనీక: రెండవ రాకడతో ఒకనినొకడు ఆదరించుకొనండి
2 థెస్సలొనీక: పాప పురుషుడు
1 తిమోతి: పెద్దల, పరిచారకుల యోగ్యతలు
2 తిమోతి: పౌలు వ్రాసిన చివరి పత్రిక
తీతు: సంఘములో లోపముగా ఉన్నవి దిద్దడం
ఫిలేమోను: ఒనేసిము కొరకైన విన్నపం
హెబ్రీ.: పాతదానికొరకు క్రొత్తదానిని వదలుకోవద్దు
యాకోబు: ఆచరణలోని మతము
1 పేతురు: శ్రమానుభవము మధ్య నిరీక్షణ
2 పేతురు: అబద్ధ బోధకులు వస్తున్నారు!
1 యోహాను: ప్రేమ, అభయమిచ్చు పత్రిక
2 యోహాను: సత్యమునందు కొనసాగు
3 యోహాను: గాయు, దెయొత్రెఫే, దేమేత్రియు
యూదా: సత్యము నిమిత్తం పోరాడు
ప్రకటన: ప్రభువు జనులే జయమొందబోతారు

## క్రొత్త నిబంధన 27 పుస్తకముల విభజన

1. జీవిత చరిత్ర
   - ఎ. మత్తయి
   - బి. మార్కు
   - సి. లూకా
   - డి. యోహాను
2. చరిత్ర
   - ఎ. అపొస్తలుల కార్యములు
3. పౌలు యొక్క పత్రికలు
   - ఎ. రోమీయులకు
   - బి. 1 కొరింథీయులకు
   - సి. 2 కొరింథీయులకు
   - డి. గలతీయులకు
   - ఇ. ఎఫెసీయులకు
   - ఎఫ్. ఫిలిప్పీయులకు
   - జి. కొలొస్సయులకు
   - హెచ్. 1 థెస్సలొనీకయులకు
   - ఐ. 2 థెస్సలొనీకయులకు
   - జె. 1 తిమోతి
   - కె. 2 తిమోతి
   - ఎల్. తీతుకు
   - ఎమ్. ఫిలేమోనుకు
4. సాధారణమైన పత్రికలు
   - ఎ. హెబ్రీయులకు
   - బి. యాకోబు
   - సి. 1 పేతురు
   - డి. 2 పేతురు
   - ఇ. 1 యోహాను
   - ఎఫ్. 2 యోహాను
   - జి. 3 యోహాను
   - హెచ్. యూదా
5. ప్రవచనములు
   - ఎ. ప్రకటన